## ఊరెళ్తున్నారా..? తస్మాత్ జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఎస్పీ వైభవ్ రఘునాథ్


గైక్వాడ్ వైభవ్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 4 : దసరా సెలవులకు సొంతూళ్లకు పయనమవుతున్నారా..? అయితే ఇల్లుగుల్ల కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని ప్రయాణం సాగించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. పండగ నేపథ్యంలో సెలవులు ఉండడంతో సొంతూళ్లు.. బంధువుల ఊళ్లకు.. పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి చోరీలు చోటు చేసుకోకుండా నియంత్రణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇండ్లల్లో నగలు, ఆభరణాలు, డబ్బు ఉంచరాదని, విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చుకోవాలని కోరారు. ఇండ్లకు తాళాలు వేసి ఇంటిలోపల, బయట లైట్లు వేసి ఉంచాలన్నారు. పక్కింటి వారికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, ఇండ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని చెప్పాలన్నారు. విలువైన వస్తువులను బ్యాంకులో ఉంచలేని పరిస్థితుల్లో ఉంటే వెంట తీసుకెళ్లాలని, మీ ఇండ్ల ఎదుట న్యూస్‌పేపర్, పాల ప్యాకెట్లు ఉండకుండా చూసుకోవాలన్నారు. బీరువా తాళాలను ఇండ్లల్లో ఉంచరాదని, గేటుకు లోపల నుంచి తాళాలు వేయాలని, ఇంటిముందు చెప్పులు ఉంచితే ఎవరో ఉన్నట్లు దొంగలకు అర్థమవుతుందన్నారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లిన తర్వాత ఇంటి సమీపంలోని వారికి ఫోన్‌లో టచ్‌లో ఉండాలన్నారు. ఎవరిపైనా అనుమానం వస్తే 100 నెంబర్‌కు కానీ, కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657709కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతిఇంటి ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే మొబైల్‌ఫోన్‌లో ఎప్పటికప్పుడు ఇంటికి ఎవరొస్తున్నారు..? ఎవరు వెళ్తున్నారు..? అన్న విషయాలను గమనించే అవకాశం ఉంటుందన్నారు.

## మట్టి ట్రాక్టర్లను వదిలేయడంపై ఎస్పీ సీరియస్




- విచారణకు ఆదేశం

కోడేరు, అక్టోబర్ 4 : మైనింగ్‌శాఖ అనుమతుల్లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకొని వదిలేయడంపై ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సీరియస్ అయ్యారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ''పట్టుకున్నారు వదిలేశారు'' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. వార్తపై సమగ్ర నివేదికను తమకు పంపాలని కిందిస్థాయి అధికారులను ఎస్పీ ఆదేశించారని సమాచారం. సంబంధిత అధికారి మట్టి తవ్వుతున్న ప్రదేశం నుంచి మైనింగ్‌శాఖ అనుమతులు ఉన్నాయా? లేదా? ఈ మట్టిని ఎక్కడి నుంచి.. ఎక్కడికి తరలిస్తున్నారు. తరలిస్తున్న మాఫియా రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గృహ నిర్మాణలకు తరలిస్తున్నారా? అనే విషయంపై నివేదికను తమకు నివేదించాలని సూచించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. రెవెన్యూ, పోలీసులు మట్టి ట్రాక్టర్లను పట్టుకొని వదిలేసి దాగుడు మూతలు ఆడిన తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టిని అక్రమంగా తరలించకుండా నియంత్రించాల్సిన అధికారులే నాన్చుడు ధోరణితో మెతక వైఖరిని ప్రదర్శించడంపై పలువురు మండిపడుతున్నారు. మట్టి ట్రాక్టర్లను తాసీల్దారే స్వయంగా పట్టుకొని.. రెవెన్యూ సిబ్బందిని, పోలీసులను అప్పగిస్తే ఘటనా స్థలానికి వెళ్లిన అధికారులు ట్రాక్టర్లను ఎందుకు వదిలేసినట్లు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏమైనా మట్టి మాఫియా సదరు అధికారులకు చేతులు తడిపారా? లేక బలమైన నాయకులు ఎవరైనా వత్తిళ్లు చేయడంతో వందిలేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు మట్టి ట్రాక్టర్లను పట్టుకొని వదిలేయడంపై పోలీసుల చిత్తశుద్ధిని శంకిస్తున్నారు. సంఘటనపై ఎస్పీ స్థానిక అధికారులతో విచారణ జరిపించకుండా వేరే ప్రాంతానికి చెందిన అధికారితో సమగ్ర విచారణ జరిపిస్తే ఈ మాఫియా వెనుక ఎవరి హస్తం ఉందో.. గుట్టురట్టు అయ్యే అవకాశం ఉన్నది. ఏదీ ఏమైనా ఎస్పీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో.. ఈ ట్రాక్టర్ల వ్యవహారం ఎంత వరకు వెళ్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## సూర్యప్రకాశ్‌రావును సన్మానించిన ఉప్పల


సూర్యప్రకాశ్‌రావును అభినందిస్తున్న ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి, అక్టోబర్ 4 : కల్వకుర్తి సూర్యలత స్పిన్నింగ్ మిల్లు గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన బీఆర్‌ఎస్ నాయకుడు సూర్యప్రకాశ్‌రావును శుక్రవారం కల్వకుర్తిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఉప్పల వెంకటేశ్ సన్మానించారు. బీఆర్‌ఎస్‌కేవీ అభ్యర్థిగా గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందడం.. అధికార కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టని పేర్కొన్నారు. సూర్యప్రకాశ్‌రావును అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు గణేశ్, కిషోర్, భగత్‌సింగ్, రామకృష్ణ, నాగరాజు, కృష్ణ, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తిసాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కేవీకే కోఆర్డినేటర్

బిజినేపల్లి, అక్టోబర్ 4 : మండలంలోని పాలెం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతులకు పత్తిసాగు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంట తీసుకునే అనువైన అధిక సాంద్రత పద్ధతి గురించి వివరించారు. ఈ పద్ధతిలో పత్తిసాగు చేయడంతో పంట ఒక్కటేసారి పక్వానికి వచ్చి పంటకాలం తగ్గుతుందని, దీంతో రెండో పంటను సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ వాసు, శాస్త్రవేత్తలు శైల, రాజశేఖర్, ఆదిశంకర్, రామకృష్ణ, జ్యోత్స్న, భార్గవ్, రైతులు తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
I, **MOHD OMER QUADRI** S/o **MOHAMMAD ABDUL AKBAR HUSSAN** H.No:19-61/1, Maruthi-nagar Colony, Achampet, Nagar kurnool Dist.,I have changed my name from **MOHD OMER QUADRI** vide affidavit date 04-10-2024 before Rajendher Advocate & Notary, Achampet.

**WANTED**
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-AII

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# డిజిటల్ కార్డుతోనే సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ బాదావత్ సంతోశ్


కంటోన్‌పల్లిలో డిజిటల్‌కార్డు సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

వెల్దండ, అక్టోబర్ 4 : ప్రతి ఇంటికీ సంక్షేమాభివృద్ధి ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంటోన్‌పల్లిలో క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఇంటి యజమానుల వివరాల సేకణపై ప్రత్యక్షంగా ఆరాతీశారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాల సక్రమంగా పొందుపర్చాలని సూచించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి సరఫరా అవుతున్న గుడ్లు, సన్నబియ్యాన్ని పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి ఫలాలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు వెల్దండలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ఆయన పరిశీలించి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తాసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీఎం లక్ష్మణ్, కార్యదర్శి గిరి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో అనువైన పంటలను సాగు చేసుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శరణ్‌తేజ్

బిజినేపల్లి, అక్టోబర్ 4 : రైతులు యాసంగిలో అనువైన పంటలు సాగు చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త శరణ్‌తేజ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగారం గ్రామంలోని వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో యాసంగి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో అనువైన పంటలు, వాటి వంగడాల గురించి వివరించారు. యాసంగి సాగులో పాటించాల్సిన సమగ్ర పోషణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. గ్రామాల్లో యాసంగిలో వేసుకోవాల్సిన కూరగాయల సాగు గురించి వివరించారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న తదితర పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భానుశ్రీ, ఫరీద్, రైతులు ఉన్నారు.

### అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలన

తిమ్మాజిపేట, అక్టోబర్ 4 : మండలంలోని ఇప్పలపల్లిలో అవెన్యూ ప్లాంటేషన్‌ను అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు వివరాలను సేకరించారు. మండలంలో నాటిన మొక్కలలో ఎంతమేర సంరక్షించారని ప్రశ్నించారు. దీంతోపాటు ఈజీఎస్ ప్రణాళికల సంబంధించిన సభలు ఈనెల 3వరకు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఈజీఎస్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో రాములునాయక్, ఏపీవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### గంజాయి స్వాధీనం

కొల్లాపూర్, అక్టోబర్ 4 : మండలంలో సోమశిలలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం మహబూబ్‌నగర్, కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక నిఘాపెట్టి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమశిలకు చెందిన రెడ్డిగారి మల్లయ్య నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

## దసరాలోపే అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ


కొండారెడ్డిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, అక్టోబర్ 4 : దసరా పండుగకు సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లికి రానున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు దసరాను సొంత గ్రామంలో జరుపుకోనున్న నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అలాగే హెలీప్యాడ్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాండురంగారెడ్డి, వేమారెడ్డి, నారాయణ్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

### గోదాం పనులు పరిశీలన

బల్మూరు, అక్టోబర్ 4 : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు గోదాం ప్రారంభ పనులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. 8న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గోదాంను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేశ్, వెంకట్‌రెడ్డి, రాధాకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు


జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 4 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బాలికలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి భక్తి పాటలతో కళాశాల ప్రాంగణంలో హెచ్‌ఎం, బాలికలు, ఉపాధ్యాయులు ఆడిపాడారు.

### నేడు బతుకమ్మ..

బల్మూరు, అక్టోబర్ 4 : మండలంలోని చెన్నారం గ్రామంలో శనివారం రాత్రి బహుజన బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు, ఈ వేడుకకు విమలక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ, అనురాధ హాజరుకానున్నారని బీసీ రాష్ట్ర సంఘం నాయకులు కాశన్నయాదవ్ తెలిపారు. వేడుకలకు బహుజనులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎల్‌ఆర్‌ఎస్‌ను రెగ్యులరైజ్ చేసుకోవాలి

కోడేరు, అక్టోబర్ 4 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వెంటనే రెగ్యులరైజ్ చేసుకోవాలని ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శ్రీపతిరావు కాంప్లెక్స్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎనిమిది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే రెగ్యులరైజ్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

### పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 4 : ప్రభుత్వం రెగ్యుల రైజేషన్ కానీ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కలిపించిందని ఎంపీవో వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామాల్లో 1,063 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకున్నారని, ఆయా గ్రామా లప్లాట్ల యజమానులు రెగ్యులరైజేషన్ చేసుకోవాలని తెలిపారు. పరిశీలనలో ఎంపీడీవో నాగేంద్ర, కార్యదర్శి నాగశేషు ఉన్నారు.

### ఊర్కొండలో..

ఊర్కొండ, అక్టోబర్ 4 : మండలంలోని రాచాలపల్లి, మాధారం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో క్రిష్ణయ్య పర్యటించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. అనంతరం అయన ప్లాట్ల యజమానులతో మాట్లాడుతూ కావాల్సిన డాక్యుమెంట్లను కార్యదర్శులకు అందజేస్తే వెరిఫికేషన్ త్వరగా పూర్తిచేసేందుకు వీలుపడుతుందని చెప్పారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ప్లాట్ల పత్రాలు పరిశీలన

చారకొండ, అక్టోబర్ 4 : మండలంలోని సిరుసనగండ్ల పంచాయతీ పరిధిలోని 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న ప్లాట్లకు సంబంధించిన పత్రాలతోపాటు ప్లాట్లను ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్, డాక్యుమెంట్లు, ఈసీ తదితర పత్రాలు ఆయా గ్రామాల్లో కార్యదర్శులకు అందజేయాలని సూచించారు. ఆయనవెంట ఆర్‌ఐ భరత్‌గౌడ్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# గాయత్రీదేవీగా..


*జిల్లాలో అన్ని అమ్మవారి ఆలయాల్లో, మండపాల్లో వివిధ రూపాల్లో దుర్గామాతను అలంకరించారు. గాయత్రిదేవీగా, మహాలక్ష్మిగా అలంకారంలోని అమ్మవారికి పూజలు చేశారు. మండపాల ఎదుట సాయంత్రం బతుకమ్మలతో ఆడిపాడడంతోపాటు భక్తిపాటలు, డ్యాన్స్‌లతో యువత హోరెత్తించారు.*


ఆవంచలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమ్రాబాద్‌లో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు


లింగాలలో గాయత్రీదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు


నాగర్‌కర్నూల్‌లో గాయత్రి అలంకరణలో సరస్వతీమాత


ఉమామహేశ్వరంలో బ్రహ్మచారిణిగా


నాగర్‌కర్నూల్‌లో కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు..


కల్వకుర్తిలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మిగా వాసవీమాత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

## పేదలకువరం సీఎంఆర్‌ఎఫ్ పథకం

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

చారకొండ, అక్టోబర్ 4: నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ పథకమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుర్కలపల్లికి చెందిన మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట మాజీసర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగులునాయక్ తదితరులు ఉన్నారు.

## లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి


పంపిణీ చేసిన దుస్తులు ధరించిన విద్యార్థినులతో అదనపు కలెక్టర్

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 4 : విద్యార్థులు లక్ష్యాన్ని అడుగులు వేయాలనిఅదనపు కలెక్టర్ దేవసహాయం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన అచ్చంపేట పట్టణంలోని బాలసదన్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు బాలసదన్‌లో అందుతున్న వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలంటే వారు టార్గెట్ నిర్దేశించుకొని ముందుకు సాగా లన్నారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఐసీ సభ్యులు శ్రీధర్, ప్రసన్న, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీశైలం గౌడ్, పీవోఐసీ సుదర్శన్, డీసీపీయూ సిబ్బంది మధుబాబు, సంతోశ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ సర్వే

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 4 : మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి నిర్వహించినట్లు ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ తెలిపారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శి మంగ్తాలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు గద్దర్ విగ్రహావిష్కరణ

అమ్రాబాద్, అక్టోబర్ 4 : మండలంలోని మన్ననూర్ గ్రామంలో తెలంగాణ ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఉంటుందని తెలంగాణ సాయుధ, వివిధ సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, బహుజన మేధావులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఆర్థిసాయం అందజేత

చారకొండ, అక్టోబర్ 4 : మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ రాజు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొన్న బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి తిరుమల లావణ్య శుక్రవారం పరామర్శించారు. శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

### బ్యాంక్ సేవలపై కళాప్రదర్శన


బ్యాంక్ సేవలపై కళాప్రదర్శన చేస్తున్న కళాకారులు

లింగాల, అక్టోబర్ 4 : మండలంలోని రాయవరం గ్రామంలో సొసైటీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నారాయణ కళాజాత బృందం బ్యాంక్ సేవలపై కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు, ఖాతాదారులకు బ్యాంకుల ద్వారా ఎలాంటి రుణాలు పొందవచ్చో వివరించారు. బ్యాంకుల్లో డబ్బులు జమచేయడం, విత్‌డ్రా వంటి సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మన్సూర్, రూపేశ్, శ్రీశైలం, నారాయణ తదితులు పాల్గొన్నారు.

### పిచ్చి మొక్కలను తొలగించుకోవాలి

లింగాల, అక్టోబర్ 4 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి నిర్మాణాల అనుమతికోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. ఇండ్ల నిర్మాణం (ఎల్‌ఆర్‌ఎస్) అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కొలతలు ఇచ్చేందుకు ఖాళీస్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

తిమ్మాజిపేట, అక్టోబర్ 4 : మండలంలోని చేగుంట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కురుమయ్య కుటుంబానికి వ్యాపారవేత్త సురేందర్‌రెడ్డి ఎంఎస్‌ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థికసాయాన్ని అందజేశారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చెన్నయ్య, వెంకట్‌రెడ్డి బాధితుడి ఇంటికెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీశైలం, నర్సింహ, మల్లేశ్, కృష్ణారెడ్డి, బాలకృష్ణారెడ్డి, కొండయ్య, లోకేశ్ పాల్గొన్నారు.

### గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 4 : జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా రాజేందర్ ఎన్నిక కావడంపై శుక్రవారం అచ్చంపేట బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తమ తోటి న్యాయవాది మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 4 : మండలంలోని జిల్లెళ్లలో శుక్రవారం మృతిచెందిన ఎముక చెన్నయ్య కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ రాములు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా చెన్నయ్య కుటుంబ సభ్యులను రాములు గ్రామ నాయకులు పరామర్శించి రూ.3 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

### నిరుద్యోగ భృతి కల్పించాలి

తాడూరు, అక్టోబర్ 4 : నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం నెలకు రూ.4,500 నిరుద్యోగ భృతి ఇవ్వాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో తాసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణ నిరుద్యోగ భృతి చెల్లించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భరత్, మాల మహానాడు జిల్లా నాయకులు చంద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం సలహాదారు మాసన్న, లక్ష్మయ్య, పరశురాం, అర్జున్, యాదయ్య తదితరులు ఉన్నారు.